**హైటెక్ అత్త - అమెరికా కోడలు**

తాటిపాముల మృత్యుంజయుడు






ప్రవాసాంధ్ర సంస్థలు దాదాపు తాము నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ ఒక హాస్యనాటిక ప్రదర్శించడం ఆనవాయితీ. ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు వారెవరైనా సరదాగా ప్రదర్శించి హాయిగా నువ్వుకోడానికి వీలైన హాస్య ప్రహసనాల్ని నెలకొకటి మీకందిస్తున్నాం. ఈ గల్పికల్ని ఎవరైనా ప్రదర్శించుకోవచ్చు.ఎక్కడ ప్రదర్శించినా రచయితపేరు ప్రకటించవల్సిందిగా విజ్ఞప్తి. ప్రదర్శనగురించి మాకు తెలియచేసి, ఫోటోలు పంపిస్తే మేము సుజనరంజనిలో ప్రచురిస్తాం.

పాత్రలు:

కొడుకు (25 ఏళ్ళు)
కోడలు (20 ఏళ్ళు)
అత్తయ్య (50 ఏళ్ళు పైనా)
పోలీస్ ఇన్స్పెక్టర్ (35 ఏళ్ళు)

ఆహార్యం:

ఒక టేబుల్, రెండు కుర్చీలు, రెండు సెల్‌ఫోన్లు, ఒక లాండ్ ఫోను, పోలీసు దుస్తులు

సంఘటన స్థలం మరియు కాలం :

ఉదయం ఎనిమిది గంటలకి, హైద్రాబాదులో ఓ ఇంట్లో

(తెర ఎత్తగానే కుర్చీలో కూర్చుని పొడవాటి జడ వేసుకుంటుంది కోడలు. కొడుకు లోపలినుండి ప్రవేశం)

**కొడుకు:** హాయ్ స్వీటీ! రాత్రి బాగా నిద్ర పట్టిందా. అసలే కొత్త ప్రదేశం, కొత్త ఇల్లు. ఎలా వున్నావ్?
**కోడలు:** మనం అమెరికా నుండి ఇక్కడకు చేరుకొంది నిన్న మధ్య రాత్రేగా. జెట్ లాగ్ పోవడానికి ఎన్ని రోజులు పడుతుందో ఏమో. నాకన్న మీకే బాగా తెలియాలి ఇలాంటి విషయాలన్నీ.
**కొ:** జెట్ లాగ్ కనీసం రెండు రోజులైనా వుంటుంది. నీవు మొదటిసారి ఇండియా వస్తున్నావు కాబట్టి ఇంకాస్త ఎక్కువ టైం తీసుకొంటుందేమో. సరే... నేను ఇక్కడున్న మా ఇండియా ఆఫీసుకు వెళుతున్నాను. ఓ రెండు గంటల్లో తిరిగొస్తాను. (అటు ఇటు చూసి) అవునూ, అమ్మేది?
**కో:** ఇంకా నిద్ర లేచినట్టు లేదు. రాత్రి ఏయిర్‌పోర్ట్ నుండి రాగానే పట్టుమని పది నిమిషాలు కూడా మాట్లాడినట్టులేదు. ఫస్ట్ టైం

కలుస్తున్నాను అత్తగార్ని. ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలి. అసలు తీరికే వుండదేమో.

**కొ:** రాత్రి మా అమ్మను చూస్తే కాస్తా ముభావంగా వున్నట్టుంది. ఆవిడ లేకుండా మనం అమెరికాలో పెళ్ళి చేసుకొన్నాంగా. అసలే పాతకాలం మనిషి. నేను ఆఫీసునుండి తిరిగొచ్చేలోగా అవిడ్ని కాస్తా జాగ్రత్తగా డీల్ చెయ్యి. నీ మంచితనంతో మురిపించెయ్. అ తర్వాత అంతా సర్దుకుంటుంది.

**కో:** మీరేమి బెంగ పెట్టుకోకండి. ఆ విషయాన్ని నాకొదిలేయ్యండి. మీరు తిరిగొచ్చేలోగా 'మొత్తానికి నాకో మాంఛి అమెరికా కోడలును తీసుకొచ్చావురా' అనేటట్టు చేస్తాను.

**కొ:** నీ మీద నాకా నమ్మకం వుంది. వస్తాను. Let us make it a challenge. Challenge!

**కో:** Challenge!

(కొడుకు బయటకు వెళతాడు. కోడలు టేపు రికార్డర్ అన్ చేస్తుంది. 'జగదోద్ధారణ...' కీర్తన వస్తుంది. దానికి తగ్గట్టు తాళం వేస్తుంటే ఫోను మోగుతుంది.)

**కో:** హలో! ఇంకా మా అత్తయ్య నిద్ర లేవలేదండి... నేను ఈ ఇంటికి కొత్త... నిన్ననే వచ్చాను... ఏమైనా చెప్పాలా? (ఆశ్చర్యంగా) ఏమిటీ! మీరా అత్తయ్య! ఎక్కడినుండి ఫోను?... మీరు బయటికి ఎప్పుడెళ్ళారు?... బెడ్‌రూం నుండి కాల్ చేస్తున్నారా?... సెల్‌ఫోనునుండా?... ఒకే ఇంట్లో వుండి ఫోన్‌లో మాట్లాడుకోవడమేమిటి. త్వరగా కిందకు వచ్చేయండి. టీ తాగుతూ మాట్లాడుకోవచ్చు.

(బాబ్డ్ హేయిర్ స్టయిల్, బ్లూ జీన్స్, టీ షర్టు వేసుకొని, నల్ల కళ్ళద్దాలు పెట్టుకొని, ఒక చేతిలో లాప్‌టాప్, మరో చేతిలో సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ అత్తయ్య వస్తుంది.)

**అత్తయ్య:** (ఫోన్లో) ...ఏంటీ! ఫోటోలన్ని ఈమెయిల్లో పంపిస్తావా... హాయిగా యాహూ ఫోటోస్ వెబ్‌సైట్లో పెట్టెయ్యరాదు...నా ఇన్‌బాక్స్ అంతా నిండుకొంది. ఒక గిగ్ అయినా సరిపోవటం లేదు... అయినా పాతకాలంలాగా ఇలా ఫోన్‌లో మాట్లాడుతాం. త్వరగా కంప్యూటర్ కొనేసెయ్. ఎంచక్కా చాట్ చేసుకోవచ్చు... ఇదిగో మర్చిపోయాను... వైర్‌లెస్ ఇంటర్నెట్ కనెక్షన్ పెట్టించుకో... నాలాగా... ఇంట్లో ఏమూలనైనా కూర్చొని బ్రౌజ్ చేసుకోవచ్చు. బై Annie.

**కో:** (టీ ఇస్తూ) అత్తయ్య! టీ తాగండి. ఎవరా Annie? అమెరికన్నా? ఎంత చక్కగా తెలుగులో మాట్లాడుతున్నారు.

**అ:** Annie అంటే అమెరికన్ కాదు. మన పక్కింటి అనసూయమ్మ గారు.

**కో:** ఓ!

**అ:** మేమంతా కలిసి 'ఆధునిక ఆంధ్ర మహిళా హైటెక్ సంఘం' మొదలెట్టాము. ఇప్పటికి దాదాపు 30మంది సభ్యులున్నారు. నేను ఆ సంఘానికి ప్రెసిడెంటును.

**కో:** చాలా అసక్తికరంగా వుంది అత్తయ్యా! నేను తప్పక మీ క్లబ్బుకు వచ్చి అందర్ని కలుస్తాను.

**అ:** అలాగే! కానీ ఓ షరతు. నువ్వు నన్నక్కడ సరోజిని అత్తయ్య అని పేరొట్టి పిలవద్దు. నన్ను అందరూ అందంగా 'రోజీ' అని పిలుస్తారు. అక్కడ అందరివి హైటెక్ పేర్లే.

**కో:** అలాగే అత్తయ్య. మీ గౌరవాన్ని తగ్గేటట్టు చెయ్యను. చూడండి. కొన్ని రోజుల్లో మీ చేత 'అత్త మెచ్చిన కోడలు' అనేటట్టు చేస్తాను.

**అ:** ఇదేం చోద్యం అమ్మాయ్. నీవసలు అమెరికాలో పుట్టి పెరిగావా ? లేక అచ్చంపేటలోనా? ఏ కోశానా ఇంగ్లీషు మాట్లడం లేదు.

**కో:** మా నాన్నగారు అమెరికా వెళ్ళి ముప్పై సంవత్సరాలైనా ఇంకా ఆంధ్ర సంస్కృతి, సాంప్రదాయాలు అంటే ఎంతో ఇష్టం. మాతృభాష అంటే మక్కువ. నాకు చిన్నప్పుడే తెలుగు నేర్పించాడు. మేం ఇంట్లో ఇప్పటికీ తెలుగే మాట్లాడుతాం అత్తయ్యా.

**అ:** (స్వగతంగా) అనాల్సింది నిన్ను కాదు, మీ నాన్నను కాదు... కోరి అమెరికా వెళ్ళి ఈ కొరివిని తీసుకొచ్చిన నా కొడుకును అనాలి. (పైకి వ్యంగ్యంగా) చాలా సంతోషం తల్లీ. అమెరికా అమ్మాయివైనా నీలో పదహారణాల తెలుగుతనం వుట్టిపడుతుంది.

**కో:** అమెరికాలో వున్న మా నాన్న గారికి దైవభక్తి ఎక్కువ. గోదాదేవి అంటే అత్యంత మక్కువ. అందుకే నా పేరు ఆండాళ్ అని పెట్టారు.

**అ:** (స్వగతంగా) ఇంకా నయం. మీ నాన్నగారి ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ కాలేదు. నీ పేరు చెప్పలేక నా హైటెక్ సొసైటీలో సిగ్గుతో తలవంచుకునే దాన్ని. అమెరికాలో వుంటే ఏమిటీ, ఆత్మకూరులో వుంటే ఏమిటి. పిదప కాలంమనుషులు, పిదపకాలం బుద్ధులూనూ.

(సెల్‌ఫోన్ మోగుతుంది.)

**అ:** (ఫోన్లో) హలో! చెప్పవే Lilly! ఏమిటీ! ప్రతీసారీ ఫోటోషాప్ అప్లికేషన్ ఓపెన్ చేస్తే కంప్యూటర్ షట్‌డౌన్ అవుతున్నదా?... కారణం తెలియటం లేదా... నీ కంప్యూటర్లో మెమోరీ ఎంత వుంది?... టూ ఫిఫ్టీ సిక్సా? ఆ... అదీ సంగతి... ఏంటీ? Jamie ఈ ప్రాబ్లెంకు వేరే కారణం చెబుతుందా? ఆవిడకు ఏమి తెలియకున్నా అన్నీ తెలిసినట్టు మాట్లాడుతుంది. పేరు గొప్ప. ఊరు దిబ్బ. నేను చెప్పేది విను. త్వరగా మెమోరీ అప్‌గ్రేడ్ చేసుకోవాలమ్మా. ఇంకెప్పుడమ్మా మనం మన క్లబ్బు పేరుకు తగ్గట్టు హైటెక్ అయ్యేదీ? (ఫోను పెట్టేస్తుంది)

**కో:** అత్తయ్య! మీతో ఒక విషయం మాట్లాడాలి. అమెరికాలో మీ కొడుకు, నేను రిజిస్టర్ మ్యారేజ్ చేసుకొన్నందుకు క్షమించండి. దానికి కారణాలు మీకు తెలుసనే అనుకుంటాను.

**అ:** ఆ! నాకు అంతా తెలుసు. నా కొడుకు, నీవు ఒకర్నొకరు ఇష్టపడ్డారు. నీవేమో అక్కడి సిటిజన్‌వి. నా కొడుకు వీసా పూర్తి కావొచ్చింది కాబట్టి అమెరికా వదలి బయటకు వచ్చే ముందు మీరు అత్యవసరంగా పెళ్ళి చెసుకోవలసి వచ్చింది. కానీ హైటెక్ యుగంలో వుంటూ మీరొక విషయం మర్చిపోయారు.

**కో:** ఏంటి అత్తయ్యా అదీ?

**అ:** మీ రిజిస్టర్ మ్యారెజీను వెబ్ కాన్ఫరెంసింగ్ చేస్తే నేను హాయిగా ఇక్కడనుండి చూసేదాన్నిగా.

**కో:** (ఆశ్చర్యంగా) మాకా ఆలోచనే తట్టలేదు అత్తయ్యా. క్షమించండి.

**అ:** అమెరికాలో వున్న మీకు అవన్నీ నేనే చెప్పాలా? మొన్న మా క్లబ్బు మెంబర్ Kelly కొడుకు ఎంగేజ్ మెంటు అమెరికాలో జరిగింది. అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ అమెరికాలో పని చేసేవాళ్ళే. వాళ్ళు అక్కడ వుంగరాలు మార్చుకుంటే వెబ్ ద్వారా ఇక్కడ వీళ్ళు తిలకించారు. అబ్బబ్బో! దానికెంత పొగరు! ఎంత గొప్పగా చెప్పుకొంటుంది. అందుకు తగ్గట్టు Kelly చుట్టూ వంత పాడుతూ Patty, Erie లూను. నాకు తల తీసేసినంత అవమానంగా వుంది.

**కో:** అదేంటి అత్తయ్యా, అలా మాట్లాడుతున్నారు.

**అ:** లేకుంటే ఏంటమ్మా. నా కోడలు అమెరికాలో పుట్టిందని తప్ప గొప్పగా చెప్పుకోటానికి ఏమి లేవాయే. ఇక నిన్ను ఇప్పుడు చూస్తుంటే అమెరికా నుండి కాదు, అరకులోయ నుండి వచ్చినట్టున్నావు. నేను వాళ్ళ ముందు ఎలా తలెత్తుకొని తిరగాలో ఏమో.

**కో:** ఇక్కడ పరిస్థితులు ఇలా వుంటాయని ఊహించలేదు. నేను ఎంత స్వచ్ఛంగా తెలుగింటి ఆడపడుచులా వుంటే మీరు అంత ఆశ్చర్యంగా బుగ్గన వేలేసుకొంటారనుకొన్నాను. మీరేమి దిగులు పడకండి. మీ స్నేహితులు... అదే.. లిల్లీ, కెల్లీ, జేమీ, పాట్టీ, ఈరీ...

**అ:** Lilly అంటే లీలావతి, Kelly అంటే కళావతి, Jamie అంటే జయమ్మ, Patty అంటే పార్వతమ్మ, Erie అంటే ఈశ్వరమ్మ

**కో:** వాళ్ళందరిని నేను మంచి చేసుకుంటాగా. చూస్తుండండి. ఇంతకీ ఏం వంట వండమంటారు? కూరలు, వంట సామాగ్రి ఎక్కడ వున్నాయో చెప్పండి. క్షణాల్లో రుచికరంగా వంట చేస్తాను.

**అ:** దినుసులన్నీ నిండుకున్నాయి. మా హైటెక్ సంఘం పనుల వల్ల షాప్‌కెళ్ళి కొనే టైం ఎక్కడుంది. ప్రతీ ఇరవై నిమిషాలకోసారి ఫోన్‌కాల్ వస్తుంది. ఎవరికో ఒకరికి కంప్యూటర్ హెల్ప్ కావాలని. నా తల తినేస్తున్నారనుకో. నా బుర్రేమైనా కంప్యూటర్ కాదుగా, అన్ని పనులు ఒకేసారి చేయటానికి. ఏదైన ఫాస్ట్‌ఫుడ్ షాప్‌కు ఫోన్ చెయ్యి. వెరైటీగా తినొచ్చు.

**కో:** అదేంటీ! మీరు టీ పూర్తిగా తాగలేదు. మీరు ఒక చేత్తో తాగుతూ, ఒక చేత్తో టైపింగ్ చేస్తున్నారు.

అ: ఈ రోజు మీటింగ్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేస్తున్నాను. కొద్దిగా busyగా వున్నాను. TTYL

కో: TTYLలా!?

అ: అదేనమ్మా. ఛాటింగ్ కోడ్, Talk to you later. (తలకొట్టుకొంటూ) అయ్యో! ఇది కూడా తెలియకపోయే.

(అత్త టైపు చేస్తుంటే, కోడలు వేరే పని చేస్తుంది. పోలీస్ ఇన్స్పెక్టర్ దూసుకొని వస్తాడు)

పోలీసు: హాండ్స్ అప్! డోంట్ మూవ్. కదిలారంటే కాల్చేస్తాం.

(అత్తయ్య బేర్ మని ఏడ్వడం మొదలెడుతుంది.)

పో: ముందా లాప్‌టాప్‌ను సీజ్ చేసుకొంటున్నాం. దాన్ని ఇటిచ్చేయండి.

అ: అమ్మో! ఇది నా ప్రాణం. ఇది లేక నేనుండలేను.

పో: ఇవ్వకుంటే పిస్టల్ పేల్చవలసి వస్తుంది.

కో: అత్తయ్య! ముందది ఇచ్చేయండి. ఇన్స్పెక్టర్ గారు! మేమేం తప్పు చేసామో తెలుసుకోవచ్చా?

పో: ఏమి తెలియనట్టు నంగనాచిలాగ మాట్లాడవద్దు. ఆడవాళ్ళంతైన మాత్రానా మీరు నడిపే టెర్రరిస్ట్ కార్యకలాపాలు మాకు తెలియవనుకొంటున్నారా?

కో: ఏమిటి? టెర్రరిస్ట్ కార్యకలాపాలా?

పో: అవును. మీరంతా హైదరాబాద్‌లో ప్రముఖులపై రెక్కీ నిర్వహిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. మీ మిగతా గ్యాంగ్ ఎక్కడ వుందో చెప్పండి.

అ: వామ్మోయ్! ఈ రెక్కీ ఏంటి? ఈ గ్యాంగ్ ఏంటి? ఏదో మేము ముద్దుగా క్లబ్బు పెట్టుకొని మా పని మే చేసుకొంటుంటే.

పో: ఏదో ఒక గ్రూప్ ముందు పెట్టుకొని తెర వెనుక ఇలాంటి పనులు చేస్తారని మాకు తెలుసు. నిన్న గాక మొన్న నాంపల్లి రైల్వేస్టేషన్‌లో బాంబు పెట్టారని కాల్ చేసిందని మీరే అని మా అనుమానం.

అ: (తెలివిగా) మరి అది బూచీ అని తేలిపోయిందిగా?

పో: అంటే ఆ ఫాల్స్ కాల్ చేసింది మీరన్నమాట.

అ: అయ్యొయ్యోయ్! తప్పర్థం చేసుకోకండి. నేను పేపర్లో చదివింది చెపుతున్నాను.

కో: ఇన్స్పెక్టర్ గారు! మా మీద ఇంత పెద్ద నేరాలు మోపుతున్నారే, మీ దగ్గరున్న ఆధారాలు ఏమిటో మేము తెలుసుకోవచ్చా.

పో: హైదరాబాద్‌లో మీరు చేయాలనుకొన్న దాడులకు సంబంధించి మీ గ్రూప్ మధ్య రహస్యంగా నడుస్తున్న ఈమెయిల్స్‌ను మేము ట్రాప్ చేసాము. చూడండి అలాంటిది ఒక ఈమెయిల్. (కాగితం అందిస్తాడు)

అ: (కాగితాన్ని చూసి) ఒట్టు. నిజం. ఈ ఈమెయిల్ నేనసలు పంపించలేదు. (ఇంకోసారి దీక్షగా చూసి) అసలు నా ఈమెయిల్ అడ్రసు ఇందులో లేనే లేదు.

పో: ఏమో ఎవరు చూసొచ్చారు, మీకు ఎన్ని ఈమెయిల్స్ వున్నాయో. అవన్ని ఇన్వెస్టిగేషన్‌లో తేలుతాయి.

అ: (నిస్సహాయంగా) నేను అబద్ధాలాడటం లేదు. నన్ను నమ్మండి.

(ఇంతలో బయట పోలీస్ కారుల సైరన్ మోతలు. ఇన్స్పెక్టర్ జేబులోని సెల్‌ఫోను మోగుతుంది).

పో: (ఫోనులో మాట్లాడుతూ) యస్సార్!.. ఇక్కడ ఈ ఇంట్లో ఇద్దరు ఆడవాళ్ళున్నారు... పెద్ద రెసిస్టన్స్ ఏమి లేదు... నేను ఒక్కడినే హాండిల్ చేస్తాను... ఏమిటి సార్... ఇంకొందరు టెర్రరిస్ట్లు వున్నారా... పక్కింట్లోనా... సెల్‌ఫోను కాల్స్ ట్రాప్ చేస్తే దొరికారా... అక్కడికి కూడా పోలీసులను పంపించారా... ఒకే సార్... వుంటాను సార్... ఫోను పెట్టేస్తున్నాను సార్.

(ఫోను మూస్తు) ఊ!... అంటే మీ ముఠావాళ్ళు కొందరు మీ పక్కింట్లో కూడా వున్నారన్న మాట. వాళ్ళ ఫోన్ కాల్స్ ట్రాప్ చేస్తే దొరికారట. ఇక మీరు ఏవో కుంటి సాకులు చెప్పి తప్పించుకోలేరు. పనిలో పని. మీ సెల్‌ఫోన్లు కూడా ఇవ్వండి.

కో: ఒక్క క్షణం ఇన్స్పెక్టర్ గారు. అత్తయ్యా! పక్కింట్లో ఎవరున్నారో మీకు తెలుసా?

అ: ఏమో తల్లీ! నెల రోజుల క్రితం ఖాళీగా వున్న పక్కింట్లో ఓ నలుగురు కుర్రాళ్ళు అద్దెకు దిగినట్టు గుర్తు. అంతే తప్ప నేను వాళ్ళను పట్టుమని ఓ నిమిషం కూడా చూడలేదు. మాట్లాడనే లేదు. అస్సలు నాకు తీరిక వుంటేగా ... ఈ కంప్యూటర్... ఈ హైటెక్ క్లబ్బుతో.

పో: ఆహా! ఎంత మంచిగా అబద్ధం చెబుతున్నారండి. పక్కపక్క ఇండ్లలో వుంటూ... ఆహా... Never met the neighbor, never spoke to the neighbor... మరయితే మేము ట్రాప్ చేసిన ఈమెయిల్స్ మీ DSL వైర్‌లెస్ రౌటర్ ద్వారానే వచ్చినట్టు ట్రేస్ చేస్తే తెలిసింది. (వెకిలిగా) మరి దానికి అతికినట్టు ఏమి అబద్ధం చెబుతారో.

కో: అత్తయ్యా! మీ వైర్‌లెస్ రౌటర్‌కు encryption సెక్యూరిటి అప్లయ్ చేసారా?

అ: లేదు. అదేమిటి?

కో: ఆ! అదీ కారణం. ఇన్స్పెక్టర్ గారు! సావధానంగా వినండి. మా అత్తయ్య సరైన సెక్యూరిటీ తీసుకోకుంటే పక్కింటి వాళ్ళు మా వైర్‌లెస్ కనెక్షన్ ఉపయోగించుకొంటూ ఈమెయిల్స్ పంపించుకుంటున్నారు. అలాంటి వాళ్ళని 'హాకర్స్' అంటారు.

పో: ఏమో! అలాంటివేమి నాకు తెలియదు. ఆ సంజాయిషి వచ్చి యస్పీ దగ్గర చెప్పుకోండి.

కో: (ధీమాగా) నేను అమెరికన్ సిటిజన్ని. ఒక్క నిమిషం. (ఫోన్‌లో కాల్ చేస్తూ) Hello… American Embassy, Chennai… I am American citizen… My name is Andal… Last name, Kotiratnala… Kotiratnala Andal... I am visiting India, my in-laws place… To be on the safe side, I have registered with your embassy about my trip. Hyderabad police are mistaking us with terrorists. Please talk to them…

పో: (ఫోన్ తీసుకొని వింటూ) యస్...యస్...యస్... Understood. అర్థం అయ్యింది. (ఫోను ఇచ్చేస్తూ) ఇబ్బంది కల్గించినందుకు క్షమించండి. Enjoy your stay in India.

కో: పక్కింటిటెర్రరిస్టులు తప్పించుకోక ముందే వెళ్ళి మీ వాళ్ళకు త్వరగా సాయం చెయ్యండి.

(ఇన్స్పెక్టర్ వెళ్ళిపోతాడు)

అ: (కోడలు చేతులు పట్టుకొని) నన్ను, మన కుటుంబాన్ని రక్షించావే కోడలా. నువ్వు లేకుంటే ఈరోజు ఎంత పెద్ద గొడవయ్యేదో. నేను ఇంతకు ముందు అన్న మాటలు, నా ప్రవర్తనను క్షమించాలి. 'కోడలు వచ్చిన వేళ మంచిదైతే అంతా మంచే జరుగుతుంది' అని అంటారు. 'మొత్తానికి నాకో మాంఛి అమెరికా కోడలును తీసుకొచ్చాడు నా కొడుకు'

(కోడలు 'హమ్మయ్య' అనుకొంటుండగా అంటుండగా తెర)